**జరిగిన కథ :** చింతామణి అనే వేశ్య.. లీలాశుకుని నుంచి దూరమైన తరువాత యోగినిలా బతుకుతుండేది. ఆమె ఒకనాడు అగ్నిశిఖుడనే యోగిని ఆశ్రయించి, ఆత్మజ్ఞానం బోధించమని వేడుకుంది. కానీ, బాహ్యస్మృతి లేని ఆ యోగి.. ఆమె మాటలను ఆలకించలేదు. అది తనను అవమానించడమే అని చింతామణి భావించింది.






అనుసృజన:
**నేతి సూర్యనారాయణ శర్మ**

# యోగివర్యుని పునర్జన్మ

త న పగ సాధించడానికి పుల్కసుడు అనే మాతంగుణ్ని ఎన్నుకుంది చింతామణి. అతడు చాలా భక్తిపరుడు. ప్రతిరోజూ సూర్యోదయకాలంలో గంగలో మునిగి, సూర్యునికి మొక్కుకునేవాడు. ఇంటికి వచ్చి పట్టెవర్ధనాలు పెట్టుకుని తన గుడిసెలో ఒక మూల వేదికపై దేవతగా నిలుపుకొన్న మట్టిబొమ్మను పూజించి, కులవృత్తి చేసుకునేవాడు.

అతని భార్యపేరు మాలిని. భర్తకు తగిన ఇల్లాలు. తన భర్తకు కావాల్సిన ఉపచారాలన్నీ ఎప్పటికప్పుడు అశ్రద్ధ లేకుండా చేస్తుండేది. భర్త పాటించే ఆచారాలకు తగినట్లుగా తమ గుడిసెను పరిశుభ్రంగా ఉంచుతుండేది. ఆ వాడలో తిరిగే కోడి, కుక్క, పంది వంటి జీవులు తమ గుడిసె దాపులకు కూడా రాకుండా కాపాడుతుండేది.

ఆ దంపతులకు అప్పటివరకూ సంతానం కలగలేదు. దానికి ఆమె ఎప్పుడూ బాధపడుతుండేది.

ఒకనాడు భర్తను చేరి..

''నాథా! మన కులంలోని వారందరికీ సంతతి ఉంది. మనమే ఇలా ఉన్నాం. అసలు మనం మన కులాచారాలకు విరుద్ధంగా స్నానాలు, జపాలు, పూజలు చేయడం వల్లనే మనకు పిల్లలు కలగడం లేదని అందరూ చెప్పుకొంటున్నారు. మన తండ్రి, తాతలు ఎరుగని నియమాలు మనకెందుకు?! ఇదేమైనా బెడిసి కొట్టిందేమో, పోనీ మానేయరాదా?'' అన్నది.

అందుకు పుల్కసుడు..

''ఓసి వెర్రిదానా! మనం పెట్టిపుట్టలేదు అంతే! ఈ స్నానాలు, పూజలు బిడ్డలకు అడ్డం వస్తాయా?! మనవాళ్లకు తెలియకపోవడం వల్ల అలా మాట్లాడుతుంటారు. వాళ్ల మాటలు పట్టించుకోకు. యోగముంటే ఎప్పటికైనా మనకు సంతానం కలగకపోదు'' అని సర్దిచెప్పాడు.

అది జరిగిన మరో రెండు రోజులకు ...

''నాథా! పొద్దున్న ఒక బిచ్చగాడు కిన్నర మీటుతూ వచ్చాడు. తోటికోడలు బలవంతం చేస్తే.. 'మాకు పిల్లలెప్పుడు కలుగుతారు' అని వాణ్ని శకునం అడిగాను. వాడేవో మంత్రాలు పాడుతూ, నా చేయి చూశాడు. 'నీకు గాలిసోకింది. అందుకే పిల్లలు పుట్టడం లేదు. ఈ రచ్చరేకు కట్టుకో! కుంచెడు ధాన్యమిస్తే ఇస్తాను' అని చెప్పాడు. అయితే నేను వెంటనే అంగీకరించకుండా వాణ్ని రేపు రమ్మని చెప్పి పంపేశాను'' అన్నది.

అందుకు మాతంగుడు సంతోషించి..

''మంచిపని చేశావు. అటువంటివారిని నమ్మకూడదు. నీకు కావాలంటే ఊళ్లోకి పోయి ఎవరైనా ఆ విధానం సక్రమంగా తెలిసినవారి నుంచి మహిమ కలిగిన రక్షరేకులు తెచ్చిస్తాను'' అన్నాడు.

ఆ మరునాడు గంగకు పోతుండగా మాతంగునికి ఒక మాలదాసరి ఎదురుపడ్డాడు.

''దాసరీ! నువ్వు దేశాలు తిరుగుతుంటావు కదా! చాలామందిని ఎరిగే ఉంటావు. నేను సంతానం కోసం రక్షరేకు కట్టేవారికోసం చూస్తున్నాను. అటువంటి వారెవరైనా తెలిసుంటే చెబుతావా?!'' అని అడిగాడు.

అందుకు మాలదాసరి..

''నేనే కట్టగలను. ఎక్కడికో ఎందుకు?'' అని సమాధానం చెప్పాడు.

''నీమాట పక్కన పెట్టు. త్రివేణిలో జపం చేసుకునే బైరాగులను అడిగితే ఇవ్వరా?! నాకు కావాల్సింది అటువంటివి కాదు'' అన్నాడు మాతంగుడు.

అందుకు మాలదాసరి..

''అయితే ఒకపని చేయి. పల్లపు వీధిలో చింతామణి అని ఒక భోగకాంత ఉంది. ఆమె గొప్ప యోగిని అని పేరు తెచ్చుకున్నది. ఆమెను కలుసుకుంటే నీకు దారి దొరుకుతుంది'' అని చెప్పి తన దారిన తాను వెళ్లిపోయాడు.

చింతామణి ఇంటి గురుతులు విని, మాతంగుడు అక్కడికి వెళ్లాడు. ఆమెకు దండాలు పెట్టి..

''తల్లీ! నేను నీ దాసుణ్ని. నాకు పిల్లలు లేరు. నా భార్యకు గాలి సోకి అడ్డు పెడుతున్నదని మా వాళ్లంతా అంటున్నారు. నువ్వు కరుణించి రక్షరేకిస్తే కట్టుకుంటాం. మాకు పుట్టే బిడ్డకు నీపేరు పెట్టుకుంటాం'' అన్నాడు వినయంగా.

చింతామణికి తన పగతీరే సమయం వచ్చిందని అనిపించింది.

''మాతంగా! నీకు రక్షరేకుతో పనిలేదు. నాతో రా!'' అని గంగ ఒడ్డుకు తీసుకుపోయింది.

ఒకచోట గంగలో నిలబడి జపం చేసుకుంటున్న అగ్నిశిఖుణ్ని చూపించింది.

''మాతంగా! ఆయన్ను చూశావు కదా! ఈ వేసవిలో ఆయన కాళ్లకు చెప్పులు లేకుండా తిరుగుతున్నాడు